క్లుప్తంగా

జొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు లో జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని శనివారం మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన జొన్న నిల్వలు ఎక్కడ లేకుండా చూడాలన్నారు. పంట కొనుగోలు చేసిన వెంటనే లారీలోకి ఎక్కించాలన్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు.

సాత్నాల: భోరాజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు చేయాలన్నారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు'



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

నేరడిగొండ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో కృష్ణవేణి హెచ్చరించారు. శనివారం మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, ప్రభుత్వం ఆమోదించిన కంపెనీ విత్తనాలే విక్రయించాలని సూచించారు. ప్రతీ రైతుకు తప్పనిసరిగా రశీదు అందజేయాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

భీంపూర్: రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సునీల్ కుమార్, పోశాద్రి అన్నారు. భీంపూర్ మండలంలోని బెల్సారి రాంపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పంట మార్పిడి చేపట్టి బలవర్ధకమైన ఆహార పంటలను సాగు చేయాలని కోరారు. ఏవో శ్రీనివాసరెడ్డి, ఏఈవో శంకర్, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

'పంట సాగు చేయనివ్వడం లేదు'

నేరడిగొండ: అటవీ అధికారులు గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్న వ్యవసాయ భూముల్లో పంట సాగు చేయవద్దని వేధిస్తున్నారని తర్నం(కె), కుప్టి గ్రామాల రైతులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా అటవీ శాఖ అధికారులకు రైతుల సమస్యలను తెలియజేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు రైతులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు మాత్రం తామ భూముల్లో మొక్కలను నాటుతామని గుర్తులు వేస్తున్నారని, ఇప్పటికైనా అటవీ అధికారులు తాము సాగు చేస్తున్న భూముల జోలికి రావద్దన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాండురంగ్

ఇచ్చోడ: అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన అంబేకర్ పాండురంగ్ నియమాకమయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ చేతుల మీదుగా నియమక పత్రం అందుకున్నారు. పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని పాండురంగ్ అన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ సబుబాయి ప్రకాష్ రైతు పొలంలో విద్యుత్ షాక్ శనివారం ఎద్దు మృతి చెందింది. గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుంది. శనివారం ఉదయం మేతకు వెళ్లిన ఎద్దు విద్యుత్ మోటర్ కోసం ఏర్పాటు చేసిన స్టార్టర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ రూ. 50 వేలపైనే ఉంటుందని రైతు పేర్కొన్నాడు.

జొన్నల డబ్బులేవి..?

- ఖాతాల్లో జమకాని నగదు
- ఎదురుచూస్తున్న రైతులు

జిల్లాలో జొన్న సాగు	1.11 లక్షలు
మార్క్‌ఫెడ్‌కు విక్రయించిన జొన్న	4,40,000 క్వింటాళ్లు
విక్రయించిన రైతులు	13 వేలు
రైతులకు రావాల్సిన డబ్బులు	రూ.147 కోట్లు



జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోథ్: దుక్కి దున్ని.. విత్తనాలు నాటి.. చేతికి వచ్చిన పంట అమ్మినా..రైతులకు డబ్బులు రావడం లేదు. ఖర్చులు తడిసి మోపడువుతున్నా.. అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడి పెడుతున్నా.. సకాలంలో ఖాతాల్లో డబ్బులు పడడం లేదు. జిల్లాలోని రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించిన జొన్నలకు సంబంధించిన డబ్బులు రైతుల ఖతాల్లో ఇంకా జమ కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం 72 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తామని చెప్పినా.. పంట అమ్మి నెల రోజులు అవుతున్నా.. డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఈసారి యాసంగిలో జొన్న పంట 1.11 లక్షల ఎకరాల్లో సాగవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. 17, లక్షలకు క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాగా జిల్లాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 16 జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెలాఖరుకు కొనుగోళ్లు కూడా పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 ప్రకటించింది. బయట మార్కెట్‌లో రూ.2,400 నుంచి రూ.2,500 వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దుతు ధర అత్యధికంగా ఉండటం, 72 గంటల్లో జొన్న పంటకు సంబంధించిన డబ్బులను రైతుల ఖతాల్లో జమ చేస్తామని ప్రకటించడంతో రైతులు మార్క్‌ఫెడ్ కేంద్రాల్లోనే జొన్న పంటను విక్రయించారు. అయితే ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో సకాలంలో అందక నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

వానాకాలం పెట్టుబడి..

జిల్లాలో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. జొన్నల డబ్బులు చేతికి అందితేనే ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం అయ్యే అవకాశం ఉంటుంది. దుక్కి దున్ని చదును చేసుకునే తరుణం ఇదే కావడం, ఎరువులు, విత్తనాలకు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటం ఉండటంతో రైతులు జొన్నల డబ్బులకోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రైతుల చేతిలో డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే డబ్బులను ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరగా చెల్లించాలి



బోథ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్‌కు జొన్న పంట విక్రయించాను. పంటను విక్రయించి 20 రోజులు గడుస్తుంది. ఇంకా డబ్బులు జమ కాలేదు. డబ్బులు జమ చేస్తే వానాకాలం పనులు ప్రారంభిస్తాం. – సింగం రమణ, రైతు, బోథ్

ఇబ్బంది పడుతున్నారు



మార్క్‌ఫెడ్‌కు రైతులు జొన్న పంటను విక్రయించిన డబ్బులను వెంటనే జమ చేయాలి. ఇప్పటికే రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం జొన్న డబ్బులు వస్తేనే ఖరీఫ్‌కు సన్నద్ధం అయ్యే అవకాశం ఉంది. భూమి దున్నడం, ఎరువులు, విత్తనాలతో పాటు ఖరీఫ్ పనులను పెట్టుబడి అవసరం ఉంది.
– ఇట్టెడి మోహన్ రెడ్డి, స్వయం కృషి రైతు సంఘం అధ్యక్షులు, బోథ్

డబ్బులు జమ చేయాల్సి ఉంది

జొన్నలు విక్రయించిన రైతులకు నగదు చెల్లించాల్సి ఉంది. బకాయిలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. 13 వేల రైతులకు సంబంధించిన రూ. 147 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఏ క్షణమైనా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావచ్చు.
– ప్రవీణ్ రెడ్డి, మార్క్‌ఫెడ్, డీయం, ఆదిలాబాద్ జిల్లా

జొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాత్నాల: జొన్న కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం భోరాజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా రైతులు జొన్నల విక్రయం కోసం వాతావరణం సహకరించక ఇక్కడే పడిగాపులు పడుతున్నారని అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. రైతులందరికీ టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో అశోక్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

జేసీ అకాడమీ ప్రీమియర్ లీగ్ విజేత టైటాన్స్ జట్టు



ట్రోఫీతో విజేత జట్టు టైటాన్స్

ఆదిలాబాద్: జేసీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా టైటాన్స్ జట్టు నిలిచింది. శనివారం జిల్లా కేంద్రంలో టైటాన్స్, జేసీఎ రైజర్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్లో టాస్క్ గెలిచి బ్యాటింగ్ చేసిన టైటాన్స్ జట్టు 184 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టైటాన్స్ జట్టులో కశ్యాప్ పటాస్కర్ 100 పరుగులు చేయగా, దర్శ్ అగర్వాల్ 56 పరుగులతో సత్తా చాటాడు. రైజర్స్ జట్టులో శ్రీ చరణ్ 116 పరుగులు చేసినా, జట్టు మొత్తం నిర్ణీత 20 ఓవర్లలో158 పరుగులకే పరిమితమైంది. దీంతో టైటాన్స్ జట్టు 25 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ తో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ గా నిలిచాడు. ఉత్తమ బౌలర్ గా సాయికిరణ్, ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ వంజరి నిలిచినట్లు జేసీఏ అకాడమీ నిర్వాహకుడు జయేంద్ర పటాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో పార్థసారథి, దేవేంద్ర పటాస్కర్, రాజేష్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు ఎదుట ట్రాఫిక్ తిప్పలు



ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న స్థానికులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మార్కెట్ యార్డు అధికారుల నిర్లక్ష్యంతో జొన్న పంట అమ్మకానికి తీసుకొచ్చిన వాహనాలతో రద్దీ పెరిగింది. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు లేకపోవడంతో సుమారు 40 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 108 అంబులెన్స్ అరగంట పాటు చిక్కుంది. ఇప్పటికైనా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పదోన్నతి పొందిన ఏడీలకు సన్మానం



వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సిరాజ్ అలీకి రిమ్స్ ఆసుపత్రి, నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్ రెడ్డికి రిమ్స్ మెడికల్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన వారిని శనివారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యుడు అశోక్, ఉద్యోగులు గుజరాతి గోపి, ఎస్.మహేందర్, వెంకట రమణ, సి.మధుసుదన్, సందీప్, ఖుర్షీద్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: ఉపాధి పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు పూర్తి చేసే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే కూలీలకు డబ్బులు చెల్లించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో హరిత హారం కింద మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందన్నారు. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'సైనిక్' ప్రవేశ పరీక్షలో ఉట్నూర్ విద్యార్థి ప్రతిభ



రోహిత్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కనురే జయశ్రీ రాంకిషన్‌ల కుమారుడు రోహిత్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి జిల్లా మొదటి ర్యాంక్ సాధించారు. చిన్నతనం నుంచి చదువులో చురుగ్గా ఉన్న కనురే రోహిత్‌ను సైనిక్ స్కూల్ చేర్పించేందుకు తల్లిదండ్రులు నిర్మల్ జిల్లాలోని కల్లూ ర్ గ్రామంలోని శ్రీసాయి మోడల్ స్కూల్‌లో శిక్షణ ఇప్పించారు. దీంతో విద్యార్థి జాతీయ స్థాయిలో 148 ర్యాంక్, రాష్ట్రంలో 3వ ర్యాంక్, ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంక్‌ను సాధించి తన ప్రతిభ చాటుకున్నాడు. గ్రామస్తులు రోహిత్‌ను శాలువాతో సత్కరించారు.

బురదమయంగా బస్టాండ్



ఇచ్చోడ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ఆవరణ వర్షం నీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు, బస్సు డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. రానున్న వర్షకాలంలో సమస్య మరింత తీవ్రత కానుంది. ఆర్టీసీ అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– ఇచ్చోడ

వందశాతం అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

తలమడుగు: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ యాప్ ద్వారా మండలంలో వందశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చదువుకొని వారిని గుర్తించి, చదువుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ బడులకు పిల్లలు వచ్చేలా చూడాలన్నారు. ఎంఈవో వెంకట్ రావు, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, వైద్యులు హరీశ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ నియమించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రధానమంత్రి 15 అంశాల కార్యక్రమం అమలు కమిటీలను రాష్ట్రంలో వెంటనే ఏర్పాటు చేయాలని సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖవాజా సిరాజుద్దీన్ ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఆధారంగా పథకాలను అమలు చేయడం ద్వారా మైనారిటీల్లోని వెనుకబాటుతనాన్ని తొలగించవచ్చన్నారు. ఐసీడీఎస్, సర్వశిక్షా అభియాన్, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ యోజన, మదర్సాల ఆధునీకరణ, ఉర్దూ విద్య, స్కాలర్‌షిప్‌ల కింద మైనారిటీలకు విద్యా అవకాశాలను మెరుగుపరచడం జరుగుతుందన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన షేక్ షబ్బీర్ అదృశ్యమయ్యారు. శుక్రవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఆటో రిపేర్‌కోసమని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాలేదు. చుట్టు పక్కల గాలించిన ఆచూకీ లభించలేదు. ఆయన సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టు టౌన్ సీఐ కరుణకర్ రావు తెలిపారు.

'బౌద్ధులపై దాడి సరికాదు'



మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: బౌద్ధులపై దాడి చేయడం సరికాదని ఇంద్రవెల్లి అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. నిర్మల్ జిల్లా ముదోల్ మండలం రాళ్ల బోరిగాం గ్రామంలో బుద్ధ జయంతి రోజు కొందరు మతోన్మాదులు బుద్ధ భక్తులపై దాడి చేయడం యావత్ సమాజానికి సిగ్గు చేటన్నారు. బుద్ధుడి విగ్రహం తొలగించిన చోటే మళ్లీ ప్రతిష్ఠించి, ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరత్‌వాగ్ సందీప్, కామ్‌రాజ్ వాగ్మరే, కాంబ్లే బాబాసాహెబ్, కాంబ్లే అతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ కటౌట్ మధ్య నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం తినిపించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దిగంబర్ రావు పాటిల్, సాయిచరణ్ గౌడ్, శ్రీధర్, నర్సింగ్, నగేష్, సుధాకర్ గౌడ్ , మునిగెల విటల్ ,బండారి సతీష్ , లత, సోనియా, శ్రీలేఖ పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ కేక్ కట్ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ యార్డులో అన్నదాన కార్యకమం నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, గొర్ల రాజు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను నేరడిగొండ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నేరడిగొండ మండల కన్వీనర్ ఆడే వసంత్ రావు ఆధ్వర్యంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. నాయకులు ఏలేటి రాజు రెడ్డి, వకీల్, బద్దం పోతారెడ్డి, హీరాసింగ్, పాల శంకర్, కుంట శంకర్, పెద్ద రెడ్డి, రామ్ జాదవ్ పాల్గొనారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఘన్‌పూర్ గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా అధికారులు పారిశుధ్య, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

కంకర వేశారు.. తారు మరిచారు



నేరడిగొండ: మండలంలోని పట్‌పట్‌తండా గ్రామానికి వెళ్లే రహదారిపై కంకర వేశారు.. తారు వేయడం మరిచారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారురోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.